గుండ్లవాగుకు జలకళ..

- కోతకు గురవుతున్న ప్రధానకట్ట
- రెండు చోట్ల బుంగలు
- భయాందోళనలో స్థానికులు


భారీ వర్షాలతో వచ్చిన వరద నీరు కారణంగా అలుగు పోస్తున్న గుండ్లవాగు ప్రాజెక్టు

వాజేడు: విస్తారంగా కురిసిన వర్షాలకు గుండ్లవాగు ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు తోడు గుట్టలపై నుంచి నీరు వస్తుండటంతో ప్రాజెక్టు సామర్థ్యం కంటే అధికంగా నీరు చేరింది. ప్రాజెక్టు అలుగుపై నుంచి నీరు వాగులోకి జాలువారుతోంది. అలుగుపై నుంచి పడుతున్న నీరు చూపరులను ఆహ్లాద పరుస్తుంది. ప్రాజెక్టు నిండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంటలు సాగుచేసే రైతులకు సాగు నీరు పుష్కలంగా అందే అవకాశాలు ఉండటంతో ఆయకట్టు కింద ఉన్న రైతులు పంటలు వేసేందుకు సన్నద్ధం అవుతున్నారు.

కోతకు గురవుతున్న కట్ట

ప్రాజెక్టు సామర్థ్యం కంటే అధికంగా నీరు చేరడంతో ప్రాజెక్టు పక్కన ఉన్న ప్రధానకట్ట కోతకు గురవుతోంది. నీరు ప్రాజెక్టు గోడ వద్దకు రాగానే అలలు రూపంలో కట్టకు తగులుతోంది. దీంతో కట్టకు ఉన్న మట్టి జారి నీటిలో కలుస్తుంది. ప్రధాన కట్ట కోతకు గురవుతూ కొంత భాగమే మాత్రమే ఉండడంతో ప్రాజెక్టు సమీపంలోని కొప్పుసూరు, మొరుమూరు కాలనీ గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వర్షాలు ఇంకా అధికంగా కురిస్తే కట్ట తెగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

ప్రధాన కట్టకు రెండు చోట్ల బుంగలు


ప్రాజెక్టు గోడ పక్కన కోతకు గురవుతున్న కట్ట


ప్రాజెక్టును పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

గుండ్ల వాగు ప్రాజెక్టు ప్రధాన కట్టకు రెండు చోట్ల బుంగలు పడ్డాయి. ప్రాజెక్టు గోడకు సుమారుగా 200 మీటర్ల దూరంలో ఒకటి, 250 మీటర్ల దూరంలో మరొక బుంగ ఏర్పడడంతో నీరు బుంగల ద్వారా బయటకు ప్రవహిస్తుంది. ఇరిగేషన్ అధికారులు త్వరితగతిన మరమ్మత్తులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేనిపక్షంలో ప్రాజెక్టులో నీరు ఉండే అవకాశం లేదని, రెండు బుంగల ద్వారా సుమారుగా 4 ఆయిల్ ఇంజన్లు పోసేంత నీరు వెళ్తుందన్నారు. ఇది ఇలాగే కొనసాగితే బుంగలు పడ్డ చోట కూడా కట్ట తెగే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిశీలించిన అధికారులు

గుండ్ల వాగు ప్రాజెక్టు కట్ట కోతకు గురి అవుతున్న విషయాన్ని మొరుమూరు కాలనీ గ్రామానికి చెందిన బత్తుల శ్రీను ద్వారా తెలుసుకున్న అప్పటి తహసీల్దార్ సయ్యద్ సర్వర్, ఆర్ఐ రాజు ప్రాజెక్టును పరిశీలించారు. విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

క్లుప్తంగా

వాహన తనిఖీలు



వాజేడు: మండలంలోని చీకుపల్లి జాతీయ రహదారిపై స్థానిక ఎస్సై వెంకటేశ్వర్‌రావు శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. హైవేపై వచ్చి వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనుమానితంగా కనిపించిన వారిని ప్రశ్నించి వదిలేశారు.

ఓడవాడలో వైద్య శిబిరం



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఓడవాడలో గల ప్రాథమిక పాఠశాల, 9 వార్డులోని ప్రాథమిక పాఠశాలలో శనివారం స్థానిక వెల్నెస్ సెంటర్ వైద్యురాలు ఛాముండేశ్వరి వైద్య శిబిరం నిర్వహించారు. కళ్లకలకతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి మందులు పంపిణీ చేశారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పించామన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ములుగు: విద్యుత్ లైన్ల పునరుద్ధరణలో భాగంగా నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సాయికృష్ణ శనివారం ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ కాలనీ, పాల్‌సాబ్‌పల్లి, గడిగడ్డ, సఫాయివాడ ఏరియాలో మరమ్మతు చేపడుతున్న కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ నిలివేస్తున్నట్లు తెలిపారు.

వైద్యశిబిరం ఏర్పాటు

వెంకటాపురం(కె) : మండలంలోని చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాల, కస్తూర్బా పాఠశాలల్లో స్థానిక వైద్య సిబ్బంది శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాలలో 30 మంది విద్యార్థులు కళ్లకలక బారిన పడగా వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఘనంగా జరుపుకోవాలి



ఎస్ఎస్‌తాడ్వాయి: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఈనెల 9 వ తేదీన ఘనంగా జరుపుకోవాలని ఆదివాసీ టీచర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మైపతి సంతోష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీ తెగల సంస్కృతి, సంప్రదాయాలను, హక్కులను, చరిత్రని కాపాడుకోవాలని ఐక్యరాజ్య సమితి 1994లో ప్రత్యేక చట్టాన్ని ప్రవేశపెట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేడుకలను అధికారికంగా నిర్వహించి సెలవు ప్రకటించాలని కోరారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, విద్య సంస్థల్లో వేడుకలను నిర్వహించాలని ఆయన కోరారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



ఎస్ఎస్‌తాడ్వాయి: పదోతరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఏటూరునాగారం పీఎంఆర్‌సీ ఏపీసీఓ వాగ్య అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. పాఠశాలల్లోని విద్యార్థినుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తరగతి గదులను సందర్శించి సెలబస్ వివరాలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల విద్య బోధనపై ఆరా తీశారు. విద్యార్థినులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకోవాలన్నారు. పాఠ్యాంశాలపై సందేహాలు ఉంటే ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకోవాలన్నారు. ఆయన వెంట పాఠశాల హెచ్‌ఎం పద్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

నిరుద్యోగభృతి చెల్లించాలి

ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీని నెరవేర్చాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందించారు. ఎన్నికల సమయంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారికి ప్రతీ నెల రూ. 3016 నిరుద్యోగభృతి అందిస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ కన్వీనర్ సిరికొండ బలరాం, జవహర్‌నాయక్, కార్యదర్శి రవీంద్రాచారి, రవిరెడ్డి, కృష్ణాకర్, రాకేష్, యాదగిరి, కుమార్, సంపత్, రాకేష్‌రెడ్డి, కిషోర్‌నాయక్ పాల్గొన్నారు.

పీఓ బంగ్లా ఎదుట పెద్ద గుంతలు

- 163 రహదారిపై మలుపులు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టింపులేదు..


ఐటీడీఏ పీఓ బంగ్లా ఎదుట ఏర్పడిన గుంతలు


మంగపేట-వరంగల్ మలుపు వద్ద..

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని హైదరాబాద్- భూపాలపట్నం వెళ్లే 163 జాతీయ రహదారి, ఐటీడీఏ పీఓ బంగ్లా ఎదుట పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఐటీడీఏ కార్యాలయం నుంచి గెస్ట్ హౌస్ చుట్టూ ఉన్న మలుపుతో పాటు వరంగల్ వెళ్లేందుకు వేసిన రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పాటు వాహనాల రాకపోకలతో ఐటీడీఏ పీఓ గెస్ట్‌హౌస్, మంగపేట, వరంగల్ మలుపు, పోలీస్‌స్టేషన్, ఐటీడీఏ మలుపు వద్ద మూడు ఫీట్ల మేర గోతులు పడ్డాయి. దీంతో హైదరాబాద్ నుంచి ఏటూరునాగారం, వాజేడు, వెంకటాపురం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షపు నీటితో గోతులు నిండిపోవడంతో వాహనాలు దిగబడడం, ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి కిందపడిన సంఘటనలు ఉన్నాయి. అయినప్పటికీ 163 నేషనల్‌హైవే ఇంజనీరింగ్, ఆర్ అండ్‌బీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. నిత్యం ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, జిల్లా అధికారయంత్రాంగం ఈ రోడ్డు మార్గనే రాకపోకలు కొనసాగిస్తున్నా గోతులను పూడ్చివేసేందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.

వరద బాధితులపై నిర్లక్ష్యం తగదు


బాధితులకు దుస్తులు అందజేస్తున్న సభ్యులు

ఎస్ఎస్‌తాడ్వాయి: వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వవ్యహరిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ ఆరోపించారు. ఎమ్మెల్యే సీతక్క పిలుపు మేరకు బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ కొడకండ్లవారి సభ్యుల సహకారంతో శనివారం మేడారంలోని వందమంది వరద బాధిత కుటుంబాలకు చేయూనందించారు. నిత్యావసర సరుకులు, దుస్తులు, పండ్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు సర్వం కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న వరద బాధితులను సీఎం కేసీఆర్ పట్టించుకోవడం లేదన్నారు. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ముందస్తుగా హెచ్చరించినా ప్రభుత్వం చర్యలు చేపట్టలేదని అన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే ప్రజలు సర్వం కోల్పోయారని విమర్శించారు. వరదలతో నష్టపోయిన బాధితులకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకొచ్చి ఆదుకుంటున్నా ప్రభుత్వం మాత్రం మొద్దునిద్ర వీడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణ సాయం అందించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ గౌరవ అధ్యక్షుడు అనంతరెడ్డి, జిల్లా నాయకుడు అరెం లచ్చుపటేల్, సర్పంచ్ ఇర్ప సునీల్‌దొర, నాయకులు తిరుపతి, రఘు, ఓరుగంటి అనిల్, సిద్ధబోయిన రమేష్, వెంకన్న, బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ సభ్యులు ప్రసన్న కుమార్, నరేష్, శ్రీను, అశోక్, రమేష్, గోపి, రవి, సంపత్, అక్బర్, ప్రసాద్ పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరం


ములుగు రూరల్ : చిన్నారికి తల్లిపాలు తాగిస్తున్న సీడీపీఓ స్వాతి


ఏటూరునాగారం : అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ అఫ్రీన్

ములుగు రూరల్: బిడ్డకు తల్లి పాలు శ్రేయస్కరమని సీడీపీఓ స్వాతి అన్నారు. మండలంలోని మహ్మద్‌గౌస్‌పల్లిలో సర్పంచ్ గోల్కొండ శైలజ ఆధ్వర్యంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించాని సూచించారు. బిడ్డకు తల్లిపాలు ముద్దు- డబ్బాపాలు వద్దు అనే నినాదంతో తల్లిపాల వారోత్సవాలు చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం చిన్నారులకు అన్న ప్రాసన, అక్షరాభ్యాంసం చేపించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కమరునీసాబేగం, అంగన్‌వాడీ టీచర్లు దేవిక, రజిత, ఆయాలు సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: శిశువు జన్మించిన వెంటనే తల్లి ముర్రుపాలు పట్టించాలని, ముర్రుపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆఫ్రీన్ అన్నారు. మండల కేంద్రంలోని ఓడవాడ - 2 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించినట్లయితే శిశువుకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కొంతమంది తల్లులు డబ్బాపాలు పట్టిస్తారని, వాటితో బిడ్డ తీవ్ర అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శ్రీలతతో పాటు లలితాకుమారి, సరోజ, రాజేశ్వరి, పద్మ, లలిత, భవాని, తరంగణి, ఆశ వర్కర్ స్వరూప, తల్లులు, బాలింతలు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే మండల కమిటీ ఎన్నిక



మంగపేట: తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమ సంఘం మండల కమిటీని శనివారం ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి నిమ్మగడ్డ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న 36 మంది వర్కింగ్ జర్నలిస్టుల సమక్షంలో ఓటింగ్ ద్వారా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వేమ సురేష్, ప్రధాన కార్యదర్శిగా వడ్ల కొండ వీరయ్య, ముఖ్య సలహాదారులుగా సీనియర్ విలేకరులు ధర్మపురి శ్రీనివాస్, ఎర్రం స్వామి, వడ్లకొండ శ్రీనివాస్, మేడ ఆదినారాయణ, కల్లెబోయిన శ్రీనివాస్, మటం రమేష్, అక్కపెల్లి రాజేష్, నిమ్మగడ్డ శ్రీనివాస్, సాంబశివరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో చిన్నపత్రికల సంఘం జిల్లా అధ్యక్షుడు ఈసంపెల్లి సురేందర్, ఈసీ సభ్యుడు గాజుల పవన్‌కుమార్, పాత్రికేయులు అక్కినపెల్లి వెంకటేశ్వర్లు, కుర్మిళ్ళ శ్యామ్, అక్కపెల్లి నరేష్, జయరాజ్, శంకర్, స్నేహకుమార్, కుమారస్వామి, ఇషాక్, రఫీ, మధుకర్, కేవీ చారి, పత్తిపాక రాము తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కాటారం: కాటారం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ నాగరాజు శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల పరిసరాలు, ఫర్నిచర్, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు, పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఉన్నాయా లేదా అని ఆరా తీశారు. వృద్ధులు, దివ్యాంగులైన ఓటర్లు వెళ్లేందుకు ర్యాంప్‌లు, తదితర అంశాలపై సిబ్బందితో చర్చించారు. పోలింగ్ కేంద్రాల్లో పూర్తి సౌకర్యాలు ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆర్ఐ వెంకన్న, వీఆర్ఏ జితేందర్ ఉన్నారు.

ట్యాంక్‌బండ్ నిర్మాణానికి కృషి ..


వినతిపత్రం అందజేస్తున్న బుర్గుపేట గ్రామస్తులు

వెంకటాపురం(ఎం): ఇటీవల కురిసిన భారీవర్షాలతో గండ్లు పడిన మారెడుగొండ చెరువును ట్యాంక్ బండ్‌గా మార్చేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్ అన్నారు. మండలంలోని బుర్గుపేట గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించి వరద బాధితులను పరామర్శించారు. గ్రామంలోని 100కు పైగా కుటుంబాలు వరద ముంపుకు గురయ్యాయని, ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వరదల్లో కొట్టుకపోగా ఒకరి మృతదేహం లభించిందని, మిగిలిన ఇద్దరి ఆచూకీ ఇప్పటి వరకూ లభించలేదని గ్రామస్తులు ఆయన ఎదుట వాపోయారు. మారెడుగొండ చెరువుకు పడిన గండ్లను వెంటనే పూడ్చివేయాలని, ముంపునకు గురైన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకునేవిధంగా చర్య తీసుకోవాలని వినతిపత్రం అందించారు. స్పందించిన సీతారాంనాయక్ వదర బాధితుల సమస్య ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గట్టు కుమారస్వామి, మండల శ్రీధర్‌రెడ్డి, ఓదేలు, ఆ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

‘తొలిమెట్టు’ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నారాయణ

ములుగు: తొలిమెట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఈసం నారాయణ కోరారు. ఈ మేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లేశం అధ్యక్షతన ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల పరిధిలోని ప్రభుత్వ కళాశాలల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, వాలంటీర్లకు ‘పిల్లల కోసం కమ్యూనిటీ’ సంస్థ నిర్వహించిన తొలిమెట్టు అవగాహన కార్యక్రమానికి కళాశాల ముఖ్య అకాడమిక్ గైడెన్స్ అధికారి డాక్టర్ డీటీ చారితో కలిసి ఆయన హాజరైయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులను మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం తొలిమెట్టు అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయాలని అన్నారు. ఉపాధ్యాయులకు తొలిమెట్టుతో అనుభవం వస్తుందన్నారు. కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ మల్లేశం పాల్గొన్నారు.

బాధితులకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలి


ఐటీడీఏ ఆవరణలో మాట్లాడుతున్న అరుణ్

ఏటూరునాగారం: ఇటీవల కరిసిన భారీ వర్షాలతో ముంపునకు గురైన బాధితులకు ప్రభుత్వం భూమి, పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని గిరిజన భవన్, పోస్టుమెట్రిక్ హాస్టళ్లలో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాల్లోని వరద బాధితులతో శనివారం ఆయన మాట్లాడారు. కొండాయి, ఎలిశెట్టిపల్లి, మల్యాల గ్రామాలు ముంపు గురి కావడంతో ప్రజలు ఇబ్బందుల్లో పడ్డారని అన్నారు. ముంపు బాధితులకు అధికారులు, పోలీస్ యంత్రాంగం చేసిన సేవలు మరువలేనివన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముంపు గ్రామాలకు శాశ్వత పరిష్కారం చూపించాలని, ఎత్తులో ప్రాంతంలో భూమి కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోడెం బాబు, నాయకులు ఆలం కిషోర్, బాలకృష్ణ, కొర్నిబెల్లి గణేష్, దబ్బగట్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలను అమలు చేయాలి

ఆదివాసీ చట్టాలను పక్కాగా అమలు చేయలని తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఆవరణంలో శనివారం ఆయన మాట్లాడారు. లంబాడీలను ఎస్టీ జాబితాలో నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ హక్కులను సాధించుకునేందుకు ఉద్యమిస్తున్న ఎంపీ సోయం బాబురావుపై కొందరు డీజీపీకి ఫిర్యాదు చేయడం వికృత చేష్టలకు నిదర్శనం అన్నారు. ఆదివాసీ ఎమ్మెల్యేలు కూడా రెండు కళ్ల సిద్ధాంతాన్ని పాటిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొడెం బాబు, ఆలం కిషోర్, పులిశ బాలకృష్ణ, ఎట్టి ప్రకాష్, కొర్నిబెల్లి గణేష్, దబ్బగట్ల శ్రీకాంత్, ఆ సంఘం నాయకులు తదిరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ


వెంకటాపురం(ఎం) : నిత్యావసర సరుకులు అందజేస్తున్న గోవింద్‌నాయక్


ఎస్ఎస్‌తాడ్వాయిలో..


మంగపేటలో..

వెంకటాపురం(ఎం): మండలంలోని బుర్గుపేట గ్రామానికి చెందిన 125 మంది వరద బాధిత కుటుంబాలకు రోటరీక్లబ్ కంటోన్మెంట్ సికింద్రాబాద్ వారి సహకారంతో జిల్లా గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ శనివారం నిత్యావసర సరుకులు అందించారు. బాధితులు అధైర్య పడొద్దని ప్రభుత్వం తరపున బాధిత కుటుంబాలను ఆదుకుంటామని భరోసా కల్పించారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు రామశేషగిరిరావు, కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సభ్యులు రాజాశ్రీరాం, కృష్ణమోహన్‌గుప్తా, రాంచందర్, బీఆర్ఎస్ నాయకులు సూర్యనేని మురళీధర్ రావు, బుర్ర సమ్మయ్య, కూరెళ్ల రామాచారి, అంతటి రాము, గొర్రె దీలీప్, ముడిగె రాజ్‌కుమార్, ఉమ్మడి సాంబయ్య, గట్టు శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని నార్లాపూర్‌కు చెందిన కిరాణంషాపు యజమాని బచ్చు సుబ్బారావు ఇటీవల కురిసిన భారీ వర్షం కారణంగా వచ్చిన వరదలో సరుకులు కొట్టుకుపోయి భారీగా నష్టపోయారు. విషయం తెలుసుకున్న నర్సంపేట సీనియర్ సిటిజన్స్‌క్లబ్ సభ్యులు శనివారం చేయూతనిచ్చారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు సిద్దంశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రూ. 40 వేల ఆర్థిక సాయం అందించారు. వర్కింగ్ కమిటీ కార్యదర్శి సిద్దంశెట్టి లక్ష్మణ్, మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిద్దంశెట్టి వైకుంఠం, ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, కృష్ణమూర్తి, అధ్యక్షుడు లక్ష్మయ్య, కార్యవర్గ సభ్యుడు వీరలింగం, వెంకటేశ్వర్లు, గోవర్ధన్, ఉపేందర్, రమేష్, రాము పాల్గొన్నారు.

మంగపేట: మండల కేంద్రంలోని గౌరారంవాగు ఉధృతితో వరద ముంపుకు గురైన వడ్డెర కాలనీకి చెందిన వరద బాధితులకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సీఐ సట్ల రాజుతో కలిసి శనివారం ముంపునకు గురైన 35 కుటుంబాలకు దుస్తులు, నిత్యవసర సరుకులు అందించారు. ఎస్సై రవికుమార్, మాజీ జెడ్పీటీసీ వైకుంఠం, ఆర్యవైశ్య సంఘం నాయకులు శిద్దంశెట్టి శ్రీనివాసరావు, లక్ష్మణ్‌రావు, పడమటింటి సత్యనారాయణ, కనకారావు, వెంకటేశ్వర్లు, అనంతుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు


కొండాయిలో క్లోరినేషన్ చేస్తున్న సిబ్బంది

ఏటూరునాగారం: మండలంలోని కొండాయి, మల్యాల గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి సతీష్ ఆధ్వర్యంలో శనివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గత నెల 27 వ తేదీన నుంచి గ్రామాలు వరదల్లో చిక్కుకోగా పడవలో ద్వారా ప్రయాణం చేయాల్సి వచ్చింది. వరదగా కారణంగా గ్రామాల్లో దుర్వాసన వెదజల్లడంతో పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య పనుల చేపట్టారు. రోడ్లు, కాల్వలు, బురద గుంటలను శుభ్రం చేస్తున్నారు. మంచినీటి బావులు, చేతి పంపుల వద్ద క్లోరినేషన్ చేపట్టారు. వరద నుంచి విముక్తి పొందిన బాధితులు తిరిగి ఇంటికి బాట పడుతున్నట్లు ఆయన తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి


మాట్లాడుతున్న విజయ్

భూపాలపల్లి రూరల్: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని మహాజన సోషలిస్ట్ (ఎమ్మెస్పీ) పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ కందికట్ల విజయ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బట్టు విజయ్ కుమార్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విజయ్ మాట్లాడారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టకుంటే మాదిగ, మాదిగ ఉపకులాల ఆగ్రహానికి బీజేపీ ప్రభుత్వం గురవుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎమ్మెస్పీ జిల్లా కన్వీనర్ గట్ల రాజన్న, నాయకులు నోముల శ్రీనివాస్, గాజుల భిక్షపతి మాదిగ, సురేష్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు


అవగాహన సదస్సులో పాల్గొన్న రైతులు

కాళేశ్వరం: ఆయిల్‌పామ్ పంట సాగు చేసి రైతులు అధిక లాభాలు పొందాలని ఎంపీటీసీ రేవెల్లి మమతనాగరాజులు అన్నారు. శనివారం మెట్‌పల్లి గ్రామపంచాయతీ పరిధి బీరసాగర్ గ్రామంలో ఉద్యానవన, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ పంట సాగు గురించి గిరిజన రైతులకు వివరించారు. గిరివికాస్ ద్వారా బోర్లు వేసి ఉచిత విద్యుత్ అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి సర్పంచ్ శోభ, ఏఈఓ సంధ్యారాణి, ఆయిల్‌పాం కంపెనీ ప్రతినిధి రాజేందర్‌రెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.